క్లుప్తంగా

గాయపడిన నాయకుడికి పార్టీ నేతల పరామర్శ



అదీప్‌రాజ్‌తో కలిసి ఈశ్వరరావును పరామర్శిస్తున్న బొడ్డేడ ప్రసాదరావు

సబ్బవరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండలంలోని పైడివాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాసరి ఈశ్వరరావును పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాదరావు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి శనివారం పరామర్శించారు. మండలంలోని గొల్లలపాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులను ఆరా తీసి త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, వద్దాది అప్పలరాజు తదితరులు ఉన్నారు.

ఆదినారాయణకు గోల్డెన్ నంది పురస్కారం

పెందుర్తి: సామాజికవేత్త, స్థానిక యూనిక్ పాఠశాల అధినేత కోనేటి ఆదినారాయణ (నాని) గోల్డెన్ నంది పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లో మాక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యే అద్దంకి దయాకర్ చేతుల మీదుగా ఈ పురస్కారం తీసుకున్నారు. ఇటీవల తాము చేపట్టిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించినట్లు ఈ సందర్భంగా కోనేటి తెలిపారు.

ఘనంగా బాలికా దినోత్సవం



పాల్గొన్న కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ టి.థియోఫిలాస్ పలు అంశాలపై విద్యార్థినులకు సలహాలు సూచనలు అందించారు. వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.ఈ. ఫ్లోరా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్లునాయుడుపాలెం రోడ్డుకు మరమ్మతులు



మల్లునాయుడుపాలెం రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న బోను గంగునాయుడు

సబ్బవరం: మండలంలోని కోటపాడు–పినగాడి రోడ్డు ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పలు చోట్ల శిథిలమై గతుకులమయంగా మారింది. ముఖ్యంగా మల్లునాయుడుపాలెంలోని భూలోకమ్మ గుడి వద్ద నుండి రామాలయం వరకూ ప్రధాన రహదారి పూర్తిగా గోతులమయం కావడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. స్పందించిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోను గంగునాయుడు సొంత నిధులతో గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఉమామహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న స్వామి వారు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలోని ఉమామహేశ్వరస్వామి ఆలయ 31వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, ఏకాదశ రుద్రాభిషేకం, నవకలశారాధన, మూలమంత్ర హోమం జరిపించారు. పార్వతీ పరమేశ్వర్లు ఊరేగింపు (గ్రామసేవ)సాయంత్రం నిర్వహించారు. కల్యాణోత్సవం తర్వాత ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో పెదమడక, అగనంపూడి సెక్టార్ –1,2,3 నిర్వాసితకాలనీల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి సంఘం సభ్యులు లోవరాజు, సన్ని, కొలిపాక అప్పారావు, అప్పలరాజు, సోమేశ్వరరావు, సూర్యారావు, సతీష్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మునగ సాగు.. లాభాలు బాగు

- రైతులకు ప్రభుత్వ సహకారం
- ఉపాధి హామీ పథకం నుంచి నిధుల మంజూరు
- మార్కెటింగ్ సదుపాయం



బాటజంగాలపాలెంలో సాగు చేస్తున్న మునగ పంట



సబ్బవరం: మునగ సాగుకు ప్రభుత్వం చేయూతనిస్తోంది. ఆరోగ్యాన్ని పరిరక్షించే పంట కావడంతో ఎక్కువ విస్తీర్ణంలో అధిక సంఖ్యలో రైతులు సాగు చేసేలా చూస్తోంది. డ్వామా ఆధ్వర్యంలో తోటల పెంపకం, పరిరక్షణకు నిధులు అందిస్తూ రైతులను ఆ దిశగా సన్నద్ధం చేస్తోంది. ప్రారంభంలో పెద్దగా ఆసక్తి చూపని రైతులు ఇప్పుడిప్పుడే మునగ సాగు వైపు మరలుతున్నారని అధికారులు చెబుతున్నారు.

పలు రాయితీలు..

మునగ సాగుకు ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తోంది. తోట వేసుకున్న నాటి నుండి రెండేళ్ల పాటు తోట నిర్వాహణకు రూ.లక్ష వరకూ రాయితీ అందిస్తోంది. ఈ సొమ్మును రైతులు తిరిగి చెల్లించనవసరం లేదని అధికారులు చెబుతున్నారు. రైతు 0.25 సెంట్ల నుండి ఒక ఎకరా వరకూ భూమిలో సాగు చేసుకోవచ్చు. రైతుకు డ్వామా సంస్థ ఉపాధి హామీ పథకం నుండి నిధులు సమకూరుస్తుంది. ఒక ఎకరాకు సుమారు 450 వరకూ మొక్కలు వేసుకోవలసి ఉంటుంది. మొక్కలు నాటేందుకు గుంతలు, ఎరువులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుంది. మునగతో పాటు అంతర పంటలను కూడా సాగు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. ఇలా రెండేళ్ల పాటు తోట నిర్వహణకు ప్రభుత్వం సాయమందిస్తుంది.

సాంకేతిక, మార్కెటింగ్ సహాయం..

మునగ సాగులో మెరుగైన దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వం ఉద్యాన శాఖ నుండి అవసరమైన



తవ్వవానిపాలెంలో సాగు చేస్తున్న మునగ పంట

సాంకేతిక సహాయం కూడా రైతులకు అందిస్తుంది. మునగ పంట విక్రయించడానికి రైతులకు అవసరమైన మార్కెటింగ్ సదుపాయం కల్పించడానికి కూడా ప్రభుత్వం రైతులకు తోడ్పడుతుంది.

పుష్కలంగా పోషకాలు..

మునగలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని ఎన్నో పరిశోధనల్లో తేలింది. ప్రోటీన్లు, కాల్షియం, ఐరన్ మునగలో పుష్కలంగా ఉంటాయి. ఇందులోని అమినో ఆమ్లాల వల్ల జుట్టు, చర్మం, గోళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. విటమిన్ సి వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. పాలీఫినాల్స్, ఫైటో కెమికల్స్ శరీరంలోని మలినాలను బయటకు పంపించి రక్తంలోని ఫరియాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. మునగాకు వల్ల రక్తహీనత సమస్య తొలగిపోతుంది. ఎముకలకు అవసరమయ్యే కాల్షియం సమృద్ధిగా లభిస్తుంది. ఇందులోని పొటాషియం అధిక రక్తపోటును క్రమబద్ధీకరిస్తుంది. మునగలో పీచు అధికంగా ఉండటం వల్ల జీర్ణప్రక్రియ సాఫీగా సాగేలా చేస్తుంది. మధుమేహం ఉన్నవారికి చక్కెర పనితీరును సమన్వయపరుస్తుంది. ఇటీవల ప్రకృతి వైద్యులు కూడా మునగాకులో పోషకాల గురించి తరుచూ అవగాహన కల్పిస్తున్నారు. వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు మునగ ఉత్పత్తులు ఆహారంగా ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది.

మునగ సాగుతో అధిక ఆదాయం..

గత కొన్నేళ్లుగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు మునగాకు పొడి వినియోగం పట్ల ఆసక్తి కనబరుస్తున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో మునగ సాగును ప్రోత్సహిస్తే రైతులకు ఆదాయంతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూడా కృషి చేసినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. మునగాకు, కాడలు, విత్తనాలు ఇలా అన్నింటినీ వినియోగించుకుని ఆదాయం పొందవచ్చని అధికారులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాలకు సైతం ఈ ఉత్పత్తులను ఎగుమతి చేయవచ్చంటున్నారు.

మెండుగా ప్రభుత్వ సాయం..



మునగ సాగుకు ఆసక్తి చూపే రైతులకు అత్యధికంగా ఎకరాకు రూ.లక్ష వరకూ ఉపాధి హామీ పథకం నుంచి ప్రభుత్వం పూర్తి రాయితీ అందిస్తుంది. మండలంలో మునగ సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. 25 సెంట్ల నుంచి ఎకరా విస్తీర్ణం వరకూ సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం ఈ రాయితీ అందిస్తుంది. రైతులు పండించిన పంటకు ప్రభుత్వమే మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుంది. సాగులో ఉద్యానన శాఖ అధికారులు సహకరిస్తారు.

– వసంత కుమార్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో

రైతులకు చక్కటి ఆదాయం..



ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా ప్రోత్సహించడంతో మునగ సాగుకు రైతులు ముందుకు రావాలి. ఎకరాకు 450 వరకూ మొక్కలు వేసుకోవాలి. మొక్కలు నాటిన దగ్గర నుంచి రెండేళ్ల వరకు పోషణ, నిర్వహణకు ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లింపులు జరుగుతాయి. ఉద్యాన శాఖ పూర్తిగా పర్యవేక్షించి సాగులో మెలకువలు అందిస్తుంది. మార్కెటింగ్‌లో కూడా ప్రభుత్వం మునగ రైతులకు సహకరిస్తుంది. మునగ సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందొచ్చు.

– కిరణ్మయి, ఉద్యాన శాఖ అధికారి

అంబేడ్కర్ విగ్రహం తొలగింపుపై అవాస్తవాలు



స్థలం రిజిస్టర్డ్ డాక్యుమెంట్ చూపిస్తున్న చందక శ్రీకృష్ణ

సీతంపేట: వుడా నుంచి 2004లో చినముషిడివాడలోని 164 గజాల స్థలాన్ని ఆక్షన్‌లో కొనుగోలు చేశానని డాక్టర్ చందక శ్రీకృష్ణ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2021లో తన స్థలంలో భవన నిర్మాణాలు ప్రారంభించగా.. కొందరు వ్యక్తులు అడ్డుకున్నారని, వీరి వెనకున్న ఇందిర అనే మహిళ రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు చెప్పారు. అడిగిన సొమ్ము ఇవ్వలేదని తన సొంత స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి అడ్డు తగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఇద్దరు ఆడపిల్లలున్నారని, వారి కోసం రూపాయి రూపాయి కూడబెట్టి కొన్న స్థలంలో నిర్మాణాలు చేపట్టాలంటే లక్షలు డిమాండ్ చేస్తున్నారని, లేదంటే వారు చెప్పిన ధరకు స్థలం వారికే విక్రయించాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

దీనిపై కోర్టును ఆశ్రయించగా.. తనకు అనుకూలంగా ఇచ్చిన తీర్పు ఉత్తర్వులతో తన స్థలంలో అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగిస్తున్న రెవెన్యూ అధికారులపై ఇందిర కొంత మందితో వచ్చి అడ్డుకుని దాడులకు దిగారన్నారు. తనకు ఇందిర నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించి తన స్థలం తనకు అప్పగించాలని అధికారులను వేడుకున్నారు.

వుడా నుంచి స్థలం కొన్న రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు, కోర్టు ఉత్తర్వులు మీడియా ముందు ఉంచారు. అంబేడ్కర్ విగ్రహం తొలగింపులో వాస్తవాలను గ్రహించి తనకు న్యాయం చేయాలని అభ్యర్థించారు.

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు





పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి, పూజల్లో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్థానిక వేంకటాద్రిపై శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలబోగం జరిపించారు. అనంతరం తోమాల సేవ జరిగింది. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా స్వామివారికి గోత్రనామార్చనలు నిర్వహించారు. భక్తులు తులాభారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో భక్తులకు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

జర్నలిస్టుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



ఐ అండ్ పీఆర్ నూతన డైరెక్టర్ విశ్వనాథన్‌ను సన్మానిస్తున్న జర్నలిస్టుల ఫెడరేషన్ సభ్యులు

విశాఖ సిటీ: రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఐ అండ్ పీఆర్ నూతన డైరెక్టర్‌గా నియమితులైన కె.విశ్వనాథన్‌ను ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గం కోరింది. శనివారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బి.శివప్రసాద్‌లు నూతన డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం జర్నలిస్టులకు సంబంధించిన పలు అంశాలను డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర పూర్తికావస్తున్నా ఇప్పటికీ జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్లు మంజూరు కాలేదన్నారు. అలాగే చిన్న, మధ్యతరహా పత్రికలకు సంబంధించి తాజా జీవో ప్రకారం కొద్దిగా మార్పులు చేయాల్సి ఉందని తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని, ఇతర రాష్ట్రాల మాదిరిగా పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై నూతన డైరెక్టర్ విశ్వనాథన్ సానుకూలంగా స్పందించారు. తన పరిధి మేరకు జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. సోమవారం అమరావతిలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ



పెదగంట్యాడలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పెదగంట్యాడ: మందులపై గతంలో ఉన్న 12 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించారని పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ అన్నారు. పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి శని వారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ ఇన్సూరెన్స్‌పై గతంలో ఉన్న 18శాతం జీఎస్టీని రద్దు చేశారని తెలిపా రు. అలాగే క్యాన్సర్‌తో పాటు 36 రకాల వ్యాధులకు సంబంధించిన మందులపై గతంలో ఉన్న 12శాతం జీఎస్టీని రద్దు చేశారన్నారు. మెడికల్ పరికరాలైన థర్మా మీటర్, మెడికల్ అనాలసిస్‌పై గతంలో ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించారన్నారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి అరుణ ప్రకాష్, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అద్భుతం.. నృత్యోత్సవం



కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

మద్దిలపాలెం: కళాభారతిలో పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన్న సత్యం 96వ జయంతిని పురస్కరించుకుని విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్, వెంపటి చిన్న సత్యం స్థాపించిన కూచిపూడి కళాక్షేత్రం సంయుక్తంగా రెండు రోజుల ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ సంప్రదాయ నృత్యం, కూచిపూడి వెంపటి జయంతి నృత్యోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభించారు. తొలి రోజు కార్యక్రమంలో సుమారు 400 మంది చిన్నారులు తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అబ్బురపరిచారు. నగరంలో గల నాట్య గురువులందరి సహకారంతో ఈ కార్యక్రమం అద్భుతంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెంచురియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్‌ఎన్ రాజు, వీఎండీఏ అధ్యక్షుడు ఎంఎస్‌ఎన్ రాజు, విజయనిర్మల్ అండ్ కంపెనీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సూరపనేని విజయ్ కుమార్, విజయనిర్మల కంపెనీ చైర్మన్ ఎంఎస్ శ్రీనివాస్, కూచిపూడి కళాక్షేత్ర కార్యదర్శి కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రొఫెసర్ జీఎస్‌ఎన్ రాజు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు ఏదో ఒక సంప్రదాయ నృత్యం, సంప్రదాయ కళ నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విశాఖ నగరంలోని నాట్య గురువులను సత్కరించారు. అలాగే విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



వెంకట రామారావు (ఫైల్)

పెందుర్తి: తన భర్త కనిపించడం లేదంటూ సుజాతానగర్‌లో నివాసం ఉంటున్న ఓ మహిళ పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసింది. వివరాలివి.. సుజాతానగర్ లక్ష్మీనగర్‌లో పెద్దింటి వెంకట రామారావు (51), సువర్ణాదేవి నివాసం ఉంటున్నారు. ఈ నెల 6న ఇంటి నుంచి బయటికి వెళ్లిన రామారావు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో సువర్ణాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కె.వి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

జాగ్రత్తలు పాటిస్తే గ్యాస్ ఆదా



గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఐవోసీ అధికారి అఖిల్

అగనంపూడి: గ్యాస్ వినియోగించే సమయంలో చిన్నపాటి జాగ్రత్తలతో గ్యాస్ ఆదాతో పాటు ప్రమాదాలను నివారించవచ్చని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అసిస్టెంట్ మేనేజర్ పి.అఖిల్ అన్నారు. బిందుశ్రీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అగనంపూడి సీడబ్ల్యూసీలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వంట చేసేటప్పుడు మంట తక్కువలో పెట్టాలని, అలాగే వంట పూర్తయిన తర్వాత సిలిండర్ వద్ద రెగ్యులేటర్ ఆఫ్ చేయాలని సూచించారు. లీకేజీ ఉంటే వెంటనే గ్యాస్ సిలిండర్ లేదా రెగ్యులేటర్ మార్చడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎం.షణ్ముఖరామ శ్రీనివాస్, బి.సత్యనారాయణ, కె.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టెక్ రిడ్జ్ ఫెస్ట్

అగనంపూడి: విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల (కాజుజగ్గరాజుపేట)లో రెండు రోజుల పాటు నిర్వహించిన టెక్‌రిడ్జ్ (జాతీయ మహిళా ఫెస్ట్) శనివారంతో ముగిసింది. పాత్ర బీపీవో సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్లు ఆశిష్ మిశ్రా, ముక్కవల్లి లక్ష్మి మాట్లాడుతూ మహిళలను శాస్త్రవేత్తలుగా, పారిశ్రామికవేత్తలు తీర్చిదిద్దడానికి ఈ టెక్ ఫెస్ట్ ఎంతో దోహదపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి మాట్లాడుతూ ఉత్తమ ప్రదర్శనలు ఏర్పాటు చేసిన కళాశాలల బృందానికి రూ.మూడు లక్షల నగదు పారితోషికం అందించామన్నారు. 3845మంది మహిళా ఇంజినీరింగ్ విద్యార్థులు 13 విభిన్న ప్రాజెక్టులు ప్రదర్శించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రె నింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డీన్ డి.మనేంద్రసాయి, కన్వీనర్ వై.లక్ష్మణరావు, డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



స్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పలదేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: కణితికాలనీలో నూతనంగా నిర్మించిన పంచముఖేశ్వర ఆలయంలో విగ్రహప్రతిష్ట కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణలు, మేళతాళాల నడుమ నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, నిర్వాసితకాలనీల పెద్దలు పాల్గొని విగ్రహాన్ని ప్రతిష్టించారు. వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి హాజరై దేవతా మూర్తులకు తొలిపూజ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడరమణికుమారి తదితరులు ఆలయాన్ని సందర్శించి పంచముఖేశ్వర స్వామికి పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు ప్రసాదాలు స్వీకరించారు. కణితి, వడ్లపూడి రహదారులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ కమిటీ పెద్దలు, కణితికాలనీ వాసులు ఏర్పాట్లు చేశారు.

నేత్రదానానికి కుటుంబ సభ్యుల అంగీకారం





లక్ష్మి నేత్రాలను దానం చేసేందుకు ఒప్పందం తెలుపుతున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) మృతి చెందిన లక్ష్మి (ఫైల్)

పెందుర్తి: మరణించిన తల్లి నేత్రాలను దానం చేసి ఆమె సంతానం పెద్ద మనసు చాటుకున్నారు. పెందుర్తి పాతూరులో నివాసం ఉంటున్న నారికినిబిల్లి లక్ష్మి (83) శనివారం ఉదయం మృతి చెందారు. సమాచారం అందుకున్న స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ నేత్ర దానం కోసం మృతుని కుటుంబాన్ని సంప్రదించారు. దీంతో తల్లి నేత్రాలను దానం చేసేందుకు కుమారులు వెంకటరమణ, సత్యనారాయణ, కుమార్తె నాగమణి అంగీకారం తెలిపారు. ఎల్‌వీ ప్రసాద్ మోహిసిన్ ఐ బ్యాంక్ ప్రతినిధి కృష్ణ మృతురాలు లక్ష్మి నేత్రాలు (కార్నియా) సేకరించారు.

భెల్ గుర్తింపు యూనియన్ ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం



బీహెచ్‌ఈఎల్ పరిపాలన భవనం

గాజువాక: స్థానిక బీహెచ్‌ఈఎల్ యూనిట్‌లో గుర్తింపు యూనియన్ ఎన్నికల ప్రక్రియకు అధికారులు శ్రీకారం చుట్టారు. సంస్థలో ఉన్న అన్ని రిజిస్టర్డ్ యూనియన్లు తమ ఒరిజినల్ డాక్యుమెంట్లను యాజమాన్యానికి పది రోజుల్లోగా పంపించాలని సర్క్యులర్ వెలువడడంతో సందడి మొదలైంది. ప్రస్తుత గుర్తింపు యూనియన్ 2023 ఆగస్టు 31న ఎన్నికైన విషయం తెలిసిందే. ఆ యూనియన్ గుర్తింపు కాలం ఈ ఏడాది ఆగస్టుతో ముగిసింది. ఈ నేపథ్యంలో రిజిస్టర్డ్ యూనియన్ల డాక్యుమెంట్లను సేకరించాల్సిందిగా ఆదేశిస్తూ హైదరాబాద్ లేబర్ కమిషనర్ నుంచి స్థానిక యాజమన్యానికి సర్క్యులర్ వచ్చింది. దీంతో ఆయా యూనియన్ల నాయకులు తమకు సంబంధించిన డాక్యుమెంట్లను సిద్ధం చేస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడైనా జరిగే అవకాశం ఉందని భావిస్తున్న నాయకులు ఇప్పటి నుంచే ఎత్తుగడల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం సంస్థలో 340 మందికిపైగా ఓటర్లు ఉన్నట్టు కార్మిక వర్గాలు తెలిపాయి.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు శ్రీకారం



ఉత్సవాలకు పసుపు దంచి శ్రీకారం చుడుతున్న మహిళలు

పెదగంట్యాడ: మండలంలోని దయాల్‌నగర్ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు శనివారం శ్రీకారం చుట్టారు. పెద్ద సంఖ్యలో మహిళలు పసుపుకొమ్ములను తీసుకువచ్చి ఊరేగించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో పసుపు దంచారు. ఏటా కార్తీకమాసంలో ఇక్కడ గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 18న పరిదుబ్బును అమ్మవారికి సమర్పించి ఆపై గౌరీపరమేశ్వరుల ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించనున్నామని సంఘం అధ్యక్షుడు ఆడారి రాము, ప్రధాన కార్యదర్శి ఆడారి బాలశ్రీను తెలిపారు. కార్యక్రమంలో మారిశెట్టి రమణాజీ, మొల్లేటి కోటేశ్వరరావు, భీశెట్టి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్‌ఐతో ఏయూ ఒప్పందం



జీఎస్ఐ ప్రతినిధులతో ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధన, అభివృద్ధి రంగంలో మరో ముందడుగు వేసింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ)తో ఏయూ శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఏయూ తరపున రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. రాంబాబు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సత్య నారాయణ మహాపాత్రో సంతకాలు చేశారు. భారత ప్రభుత్వం నుంచి వచ్చిన ఇతర ప్రతినిధులు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్ ధనుంజయ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.